APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక

neelagirivartha@gmail.com

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ | మంగళవారం | 28 జులై 2026 | సంపుటి : 17 | సంచిక : 316 | పేజీలు : 12 | వెల : 5/-




జూరాలకు పెరుగుతున్న వరద

2లో



## 63 సార్లు కోర్టు ధిక్కారం!

- హైడ్రా కమిషనర్‌ను తొలగించండి
- పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
- లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
- కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్



హైదరాబాద్, నీలగిరివార్త :

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు

మిగతా 2వ పేజీలో...



## మాజీ ఎమ్మెల్యే పెద్దికి కెసిఆర్ పరామర్శ


ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ సిఎం

హైదరాబాద్, నీలగిరివార్త :

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్ది కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్య వతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల

మిగతా 2వ పేజీలో...

# మామూలోళ్లు మరెందరో?



- ఆరా తీస్తున్న అవినీతి నిరోధక శాఖ
- అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు
- వరుసపెట్టి దాడులు చేస్తున్న ఎసిబి
- ఇప్పటికే 10మంది అధికారుల అరెస్ట్
- వందల కోట్లలో అక్రమాస్తుల గుర్తింపు
- మరో వంద మందిపై ఏసీబీ నిఘా
- 65 మంది అధికారుల డేటా సేకరణ
- త్వరలో ఏసీబీ దాడులు చేసే అవకాశం




ఏఐ ఊహాజనిత చిత్రం

హైదరాబాద్, నీలగిరివార్త :

రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ మరోమారు కొరడా ఝుళిపిస్తోంది. ఇటీవలి కాలంలో వరుసపెట్టి పెద్దపెద్ద చేపలను పట్టేస్తోంది. చిన్నాచితక కేసులు నమోదు అవుతున్నా, పెద్ద చేపల విషయంలో ఎసిబి పక్కాగా సమాచారం సేకరించి దాడులు చేస్తోంది. దాడుల్లో వందల కోట్ల ఆస్తులను గుర్తించి సీజ్ చేస్తోంది. అవినీతి పట్ల ప్రభుత్వం కూడా కఠిన-వైఖరి అవలంబిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజలతో నిత్యం సంబంధం ఉండేశాఖల్లో అవినీతి ఎక్కువగా ఉందనే ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ ఆయా శాఖల అధికారులపై దృష్టి కేంద్రీకరించింది. ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులు, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ విభాగాల నుంచి అందిన సమాచారం ఆధారంగా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన 100 మంది అధికారులపై నిఘా కొనసాగుతోంది. ఇప్పటికే 65 మంది అధికారులపై ప్రాథమిక స్థాయిలో సమాచారం సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఏసీబీ దృష్టిలో అత్యధికంగా రెవెన్యూ, పోలీస్,

మిగతా 2వ పేజీలో...

## శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

- ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఇచ్చిన భరోసా
- ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత అభిప్రాయం



న్యూఢిల్లీ, నీలగిరివార్త :

నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా

మిగతా 2వ పేజీలో...



### బీహార్ బంద్‌లో ఎకె 47తో కాల్పులు

- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోలు

2లో



### టోరంటోలో దారుణ ఘటన

- భారత సంతతి యువతి కాల్చివేత

2లో

## పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

- మోడీ, అమిత్ షా క్షమాపణలకు పట్టు
- గందరగోళం మధ్యే సభలో పేపర్ లీకేజ్ నవరణ బిల్లు
- బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- బిల్లు ప్రాధాన్యం దృష్ట్యా చర్చకు అనుమతించిన స్పీకర్
- విపక్ష సభ్యుల ఆందోళనతో సభ వాయిదా వేసిన ఓంబిర్లా



న్యూఢిల్లీ, నీలగిరివార్త :

పార్లమెంట్ ఉభయసభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల నవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా విపక్షాలు ముందుకు రాలేదు. నీట్-యూజీ సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(నవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ నవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్త-య్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణలతో కేసులను 90 రోజుల్లో

మిగతా 2వ పేజీలో...

## సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

- కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు



న్యూఢిల్లీ, నీలగిరివార్త :

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవ-ర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను

మిగతా 2వ పేజీలో...

## మట్టి, ఇసుక మాఫియాలకు తుమ్మల అండ

### మాజీమంత్రి పువ్వాడ అజయ్ ఆరోపణలు

ఖమ్మం, నీలగిరివార్త :

ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వ-రరావు మట్టి , ఇసుక మాఫియా లకు అండగా ఉంటూ ప్రోత్సహం ఇస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆరోపించారు. రఘునాథ పాలెం మండలంలో అనేక మట్టి గుట్టలను అక్రమంగా తవ్వి దోచుకుంటున్నారని విమర్శించారు. గతంలో తప్పుడు ఆరోపణలు చేసిన వారే ఇప్పుడు అరాచకాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మం నియోజకవర్గంలోని ఈర్లపూడి గ్రామంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన

మిగతా 2వ పేజీలో...



## ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

- ఆర్థిక ఇబ్బందులున్నా పథకం ప్రారంభిస్తున్నాం
- విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం
- అల్పాహార పథకాన్ని ప్రారంభించిన భట్టి



ఖమ్మం, నీలగిరివార్త :

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత-త్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పా-ఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను

మిగతా 2వ పేజీలో...




## ఆగస్టులో అసెంబ్లీ సెషన్

- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
- ఆగస్టు 17 నుంచి నిర్వహించే అవకాశం

హైదరాబాద్, నీలగిరివార్త :

రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో...

# జూరాలకు పెరుగుతున్న వరద

- నెట్టెంపాడు, కోయిల్ సాగర్ మోటర్లు ఆన్ చేయాలి
- మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్



**మహబూబ్ నగర్, నీలగిరివార్త :** జూరాల ప్రాజెక్టుకు 27,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, మోటార్లను ఎందుకు ప్రారంభించడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. జూరాల ప్రాజెక్టులో ఇప్పటికే 7.1 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి చేరుకుందని వెల్లడించారు. మరికొద్ది గంటల్లో గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారని వివరించారు. పాలమూరు రైతుకు నీళ్లు అందించకుండా, ఆ నీటిని శ్రీశైలం ద్వారా ఆంధ్రప్రదేశ్ పోతిరెడ్డిపాడుకు వెళ్లేలా చేయడానికే పంపులను ఆన్ చేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని, వరదొచ్చినప్పుడు నీటిని ఎత్తిపోయ కుండా కిందికి జార విడుస్తుందని విమర్శించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కంటే ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలే ముఖ్యమని ఆరోపించారు. తక్షణమే భీమా-1లోని భూత్‌పూర్, సంగంబండ, భీమా-2 లోని శంకర సముద్రం , రంగసముద్రం, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలోని గూడెం దొడ్డి విడుదల చేసి నింపాలని కోరారు. ర్యాలంపాడు , అలాగే కోయిల్‌సాగర్రిజర్వాయర్లను నింపేందుకు వెంటనే మోటార్లను ప్రారంభించాలని, జూరాల ఎడమ, కుడి కాలువలకు పూర్తి సామర్థ్యంతో నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# బీహార్ బంద్‌లో ఎకె 47తో కాల్పులు

**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోలు**



**పాట్నా, నీలగిరివార్త డెస్క్:** రెండు రోజుల క్రితం 'బిహార్ బంద్' సందర్భంగా శివాన్ జిల్లాలో చోటుచేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై ఒక పోలీసు సిబ్బంది'ఎకే-47'రైఫిల్‌తో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయింది. ఈ ఘటనపై స్పందించిన ఉన్నతాధికారులు సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఈనెల 25న బిహార్‌లో విద్యార్థి సంఘాలు చేపట్టిన ఈ బంద్ సందర్భంగా పలు జిల్లాల్లో నిరసనకారులకు, పోలీసులకు మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, వారిని పాట్నాలోని జయప్రభ మేదాంత ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో 15 ఏళ్ల మహమ్మద్ ఆరిఫ్ అనే యువకుడు కూడా ఉన్నాడు. బంద్ కారణంగా దుకాణం మూసివేసి ఇంటికి తిరిగి వెళ్తుండగా మెడకు బుల్లెట్ తగిలిందని కుటుంబసభ్యులు తెలిపారు. వైద్యులు శస్త్రచికిత్స చేసి బుల్లెట్‌ను తొలగించారని, బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కాల్పుల ఘటనపై ప్రతిపక్ష నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ డిమాండ్ చేస్తూ... కాల్పుల ఘటనకు సంబంధించిన వీడియోను నెట్‌లో షేర్ చేశాడు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ ఘటనపై స్పందిస్తూ.. ఢిల్లీలో నిరసన తెలిపే విద్యార్థులపై పెల్లెట్ తుపాకులు, బిహార్‌లో ఏకే-47లు ప్రయోగిస్తున్నారంటూ బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

# టొరంటోలో దారుణ ఘటన

**భారత సంతతి యువతి కాల్చివేత**



shutterstock.com · 526205485

**టొరంటో, నీలగిరివార్త డెస్క్:** కెనడాలోని టొరంటో నగరంలో దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. 26 ఏళ్ల భారత సంతతికి చెందిన నవ్‌నీత్ కౌర్ అనే య-ువతిని ఓ వ్యక్తి దారుణంగా కాల్చి చంపాడు. ఇది ఒక పథకం ప్రకారం జరిగిన దాడి అని టొరంటో పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. శుక్రవారం ఉదయం 7:23 గంటల ప్రాంతంలో హంబర్‌వుడ్ బౌలేవర్డ్, రెక్స్‌డేల్ బౌలేవర్డ్ సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రత్యక్షసాక్షి తెలిపిన వివరాల ప్రకారం.. నవ్‌నీత్ కౌర్ వీధిలో నడుచుకుంటూ వెళుుండగా, సదరు వ్యక్తి ఆమెను అనుసరించాడు. అతడు ఏదో మాట్లాడటంతో నవ్‌నీత్ వెనక్కి తిరిగి చూసింది. వారిద్దరి మధ్య స్వల్ప సంభాషణ జరిగింది. ఎలాంటి గొడవ లేదా వివాదం జరిగిన సూచనలు కనిపించకుండానే, అతడు వెంటనే తుపాకీ తీసి ఆమెపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన నవ్‌నీత్‌కు అత్యవసర వైద్య సాయం అందించినప్పటికీ, ఆమె అక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన టొరంటో పోలీసులు, నిందితుడిని పట్టుకోవడానికి డ్రోన్లు, ప్రత్యేక డాగ్ స్క్వాడ్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం నాటికి ఈ హత్య కేసులో నిందితుడైన 37 ఏళ్ల శరంజిత్ సింగ్ అనే వ్యక్తిని బ్రాంప్టన్ వద్ద అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. నిందితుడిపై ముందస్తు ప్రణాళికతో చేసిన హత్య),కోర్టు నిబంధనలను ఉల్లంఘించినట్లు కేసులు నమోదు చేశారు. హత్యకు గల కచ్చితమైన కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ కేసుపై పోలీసుల హోమిసైడ్ టీమ్ విచారణ జరుపుతోంది. ఈ దాడిలో ఇతర నిందితుల ప్రమేయం ఏమీ లేదని, ఇది పూర్తిగా టార్గెటెడ్ దాడిగా భావిస్తున్నామని పోలీసులు స్పష్టం చేశ-ారు. ఈ ఘటనకు సంబంధించి ఏదైనా సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు లేదా 'క్రైమ్ స్టాపర్స్'కు తెలపాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు



.. మొదటిపేజీ తరువాయి

లబ్ధిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సర్కార్ అండ?


- న్యాయపరమైన పోరాటానికి సిద్ధమవుతున్న ప్రభుత్వం
- న్యాయ కోవిదులతో చర్చించి అప్పీల్ చేసే అవకాశం
- హైడ్రాను రద్దు చేయాలని బిజెపి డిమాండ్



**హైదరాబాద్, నీలగిరివార్త :** హైడ్రా చీఫ్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా ప్రభుత్వం నిలవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ అంశంలో లీగల్ ఒపీనియన్ తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్‌ను న్యూఢిల్లీ పంపించారు. అలాగే గతంలో కోర్టు ధిక్కారణ పిటిషన్లను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. హైకోర్టు తీర్పు కాపీ అందిన తర్వాత.. సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌కు వెళ్లాలని యోజనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై సోమవారం తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని తెలంగాణ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని అభిప్రాయ పడింది. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో న్యాయ సలహాలు తీసుకుని ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోందని సమాచారం. ఇదిలావుంటే హైదరాడ్రాను రద్దు చేయాలని బిజెపి డిమాండ్ చేసింది. రాష్ట్రంలో హైడ్రాను నిషేధిస్తే పేదల ఇళ్లు సురక్షితంగా ఉంటాయని తెలంగాణ బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు అన్నారు. హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ అంశంపై సోమవారం ఆయన స్పందించారు. ఈ తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టులాంటిదని అభివర్ణించారు. రంగనాథ్‌ను బలిపశువు చేశారని చెప్పారు. రేవంత్, ఎంఐఎం కనుసన్నల్లో హైడ్రా నడిచిందని విమర్శించారు. ఫాతిమా కాలేజీ, బడాబాబుల జోలికి హైడ్రా వెళ్లడంలేదని గుర్తు చేశారు. తొలి నుంచి పేదల ఇళ్లే హైడ్రా టార్గెట్ చేసిందని మండిపడ్డారు. హైడ్రాను రద్దు చేయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సర్కార్‌ను టీబీజేపీ చీఫ్ రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. కోర్టు ఆదేశాలను ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు స్వాగతించాయి.

# మామూలోళ్లు మరెందరో?

.. మొదటిపేజీ తరువాయి



జీహెచ్ఎంసీ, ఆర్టీఏ, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ శాఖలు ప్రజలకు నేరుగా సేవలు అందించే విభాగాలు కావడంతో లంచాలు, అక్రమ లావాదేవీలకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గతంలో వచ్చిన ఆరోపణలు సూచించాయి. కేవలం ఫిర్యాదుల ఆధారంగా కాకుండా గత ఆరు నెలలుగా అనుమానిత అధికారుల ఆర్థిక లావాదేవీలు, స్థిరాస్తులు, బ్యాంకు ఖాతాలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తులు, బినామీ లావాదేవీలు వంటి అంశాలపై ఏసీబీ నిఘా పెట్టినట్లు సమాచారం. దీని కోసం వీడియో రికార్డింగ్‌లు, డాక్యుమెంటరీ ఆధారాలు, రిజిస్ట్రేషన్ వివరాలు, బ్యాంకింగ్ లావాదేవీలు వంటి సాక్ష్యాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. పక్కా ఆధారాలు లభించిన తర్వాతే దాడులు, కేసులు నమోదు చేసే విధానాన్ని ఏసీబీ అనుసరిస్తోంది. ఇటీవలి కాలంలో ఆదాయానికి మించిన ఆస్తులు కేసుల్లో పలువురు ప్రభుత్వ అధికారులపై కేసులు నమోదు చేసిన ఏసీబీ ఇప్పటికే 10 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సమాచారం. ఈ చర్యలు మిగతా అధికారుల్లోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. అవినీతిని ఏ మాత్రం ఉపేక్షించబోమని ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీకి స్వేచ్ఛ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. శిక్షలు కఠినంగా ఉంటేనే మిగతా అధికారులకు హెచ్చరికగా నిలుస్తాయని ప్రభుత్వ పెద్దలు కూడా అభిప్రాయపడినట్లు సమాచారం. అవినీతిని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత ముఖ్యమైనది. లంచం డిమాండ్ చేసిన అధికారులు లేదా అక్రమాస్తులపై విశ్వసనీయ సమాచారం ఉంటే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ లేదా ఇతర అధికారిక మార్గాల ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారులు తరచూ సూచిస్తున్నారు. అవినీతి కేసుల్లో దాడులు నిర్వహించడం ఒక దశ మాత్రమే. అనంతరం ఆస్తుల మూలాలను నిరూపించడం, కోర్టులో బలమైన సాక్ష్యాలను సమర్పించడం, చివరకు శిక్షలు పడేలా చేయడం మరింత కీలకమైన ప్రక్రియ. గతంలో కొన్ని కేసులు సాక్ష్యాల లేమితో బలహీనపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల ఈసారి పక్కా ఆధారాలతోనే ముందుకు వెళ్లాలని ఏసీబీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# 63 సార్లు కోర్టు ధిక్కరణ!

.. మొదటిపేజీ తరువాయి

ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

# పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

.. మొదటిపేజీ తరువాయి

పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి.. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు.

# సింగరేణిని భ్రష్టుపట్టించిన కేసీఆర్

.. మొదటిపేజీ తరువాయి

పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు.



# పెద్దికి కేసీఆర్ పరామర్శ

.. మొదటిపేజీ తరువాయి

క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారని తెలిసిందే.

# శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

.. మొదటిపేజీ తరువాయి



చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బల ప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసు కోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై చర్చకు దారితీశాయి.

# మట్టి మాఫియాకు తుమ్మల అండ

.. మొదటిపేజీ తరువాయి

మాట్లాడారు. తన ఆరోగ్యంపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేశారని, తనకు ఏదో జరిగిపోయినట్లుగా అసత్య వార్తలు ప్రచారం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఆరు అడుగుల కటౌట్‌లా నిటారుగా నిలబడి ఉన్నానని, ఎప్పటికీ ప్రజల పక్షాన నిలిచి పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే చరమగీతం పాడతారని జోస్యం చెప్పారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడే వరకు ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం కొనసాగిస్తానని మాజీ మంత్రి పేర్కొన్నారు.

# ఆగస్టులో అసెంబ్లీ

.. మొదటిపేజీ తరువాయి

భావిస్తున్నట్టు తెలుస్తున్నది. లేక పోతే ఆగస్టు 24 నుంచి జరగవచ్చని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మాట్లాడుతూ ఆగస్టులో శాసనసభ సమావేశాలు పెడ్తామని, ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం ఆగస్టులో ప్రారంభించ నున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

# తాండూరులో ఘనంగా శుభప్రద్ పటేల్ జన్మదిన వేడుకలు



### ఫోన్ లో శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు

**తాండూరు, జూలై 27 :**

తాండూరు పట్టణంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శుభప్రద్ పటేల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తన పుట్టినరోజు సందర్భంగా "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమం కింద స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభప్రద్ పటేల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం ద్వారా సమాజానికి సేవ చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ

తన జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పేద విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.









భవిష్యత్తులో కూడా విద్య, వైద్యం, సామాజిక సేవలకు సంబంధించిన కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

**..హ్యాపీ బర్త్ డే శుభ ప్రద్ పటేల్ ...**

అదేవిధంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షల లేఖతో పాటు పుష్పగుచ్ఛాన్ని పంపించి అభినందనలు తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు కూడా ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేటీఆర్, హరీష్ రావు చూపిన అభిమానానికి, ఆశీస్సులకు శుభప్రద్ పటేల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కోజ్జవనం పల్లిలో (గేటు వనంపల్లి ) 98 శాతం ఎస్ఐఆర్ పూర్తి



**త్వరలోనే 100 శాతం నమోదు పూర్తి చేస్తాం..గ్రామ ప్రజలందరూ ఓటు హక్కును చూసుకోవాలి ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ఏమైనా అనుమానాలు ఉంటే గ్రామ పంచాయతీ గ్రామ కార్యదర్శి ద్వారా తెలుసుకోవాలి సర్పంచ్ అనిత ఆంజనేయులు.గ్రామ ఉప సర్పంచ్ బాల్ రాజ్**

**నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట మండలం**

నవాబుపేట్ మండల కేంద్రంలోని కొజ్జావనం పల్లి( గేటు వనంపల్లి) గ్రామంలో మొత్తం ఓటర్లు ఉండగా, ప్రస్తుతం గ్రామంలో నివసిస్తున్న వారందరి వివరాల నమోదు దాదాపు పూర్తయిందని గ్రామ సర్పంచ్ అనిత ఆంజనేయులు అన్నారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని కోజ్జవనం పల్లి గ్రామంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తూ 98 శాతం పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ అనిత--ఆంజనేయులు తెలిపారు. గ్రామంలో మొత్తం ఓటర్లు ఉండగా, ప్రస్తుతం గ్రామంలో నివసిస్తున్న వారందరి వివరాల నమోదు దాదాపు పూర్తయిందని ఆమె వెల్లడించారు. గ్రామానికి వెలుపల ఉన్న కొందరు ఓటర్ల వివరాలు, అవసరమైన పత్రాలు అందిన వెంటనే వారి నమోదును కూడా పూర్తి చేస్తామని తెలిపారు. మిగిలిన రెండు శాతం ప్రక్రియను త్వరలోనే పూర్తి చేసి కోజ్జవనం పల్లి గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలోని బూత్ నంబర్--1లో బీఎల్వో శకుంతల ఆధ్వర్యంలో 94 శాతం, బూత్ నంబర్--3లో బీఎల్వో దేవమ్మ ఆధ్వర్యంలో 99 శాతం ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. ఈ ప్రక్రియను విజయవంతం చేయడంలో బీఎల్వోలు, ఎన్నికల సిబ్బంది, గ్రామ ప్రజలు అందించిన సహకారం అభినందనీయమని సర్పంచ్ అనిత--ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బాల్‌రాజ్, జీపీఓ శారద, పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, బీఎల్వోలు. ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జవాబుదారీతనం కోల్పోవడంతోనే ...ప్రజా ఉద్యమాలు !

దేశంలో యువత తక్షణ స్పందన కోరుకుంటోంది. సమస్యలపై తక్షణ చర్యలను కోరుతోంది. రాజకీయ నాయకులు లేదా పాలకులు సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతు న్నారు. కావాలనే తాత్సారం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర నిరాశా, నిస్పృహలు ఉన్నాయి. ఏ సమయంలో చేయాల్సిన పనిని అప్పుడే చేయడం లేదు. నాన్చివేత ధోరణి కారణంగా దేశం అడుగు ముందుకు వేయడం లేదు. జీఎస్టీని తీసుకుని వచ్చి గొప్పలు చెప్పారు. ప్రజలు దీనికి బలవుతున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు జీఎస్టీ శ్లాబ్‌లను తగ్గించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆహార ధరలు పెరుగుతున్నా పట్టింపు లేదు. మందుల మాఫియాను అరికట్టడం లేదు. అవినీతి వేళ్లూనుకుని పోయింది. అయినా పట్టించుకోవడం లేదు. ఇలా ఒకటేమిటి అనేకానేక సమస్యలు ఉన్నాయి. ఇవన్నీ పట్టించుకోక పోవడం వల్లనే ..నీట్ పేపర్ లీక్ తరవాత యువత ఉద్యమించింది. ఇది మొదలూ కాదు..అంతం కూడా కాదని పాలకులు గుర్తించాలి. ఇంతటితో ఇక పీడ విరగడ అయ్యిందని పాలకుల భావిస్తే అంతకుమించి మూల్యం చెల్లించుకో తప్పదు. యువత బొద్దింకలుగా మారి దేశ రాజధాని ఢిల్లీని చుట్టుముట్టే పరిస్థితి ఎందుకొచ్చిందని ఆత్మపరిశీలన చేసుకోవాలి. పార్లమెంట్ జరుగుతోంది. అయినా సమస్యలపై చర్చించడం లేదు. ఆరోరోజు కూడా విపక్షాలు ప్రధాని మోడీ, అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ సభాసమయాన్ని వృధా చేస్తున్నాయి. ఇది ప్రజల సమయం, ప్రజలు ఇచ్చిన అధికారం అని గుర్తించాలి. ఇలాగే చేస్తూ పోతే..పార్లమెంటులో గబ్బిలాల్లా ఏళ్ల తరబడి పట్టుకుని వేళ్లాడుతున్న నేతలను కూడా తొలగించడానికి ఉద్యమించక తప్పదేమో. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనేక సందర్భాలలో జరిగాయి. దశాబ్దాల క్రితం ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. కానీ ఇప్పుడే ఎందుకింత ఉద్యమం జరిగిందంటే కారణం యువతలో ఉన్న ఆక్రోశమని గుర్తించాలి. నాయకుల తీరుపట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయని గ్రహించాలి. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే మూల స్తంభాలు తమ బాధ్యతల నుంచి దూరం జరగడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణం. చట్టసభల్లో సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపడం లేదు. అసలు సమస్యలనే గుర్తించడం లేదు. ఇకవాటిపై చర్చల గురించి ఆలోచన తరవాత. ప్రధాన ప్రతిపక్షం సమస్యలపై చర్చ చేయకుండా సభను స్తంభింప చేయడం మాత్రమే చేస్తోంది. అధికార పక్షం ప్రజల సమస్యలకు జవాబు ఇవ్వండ లేదు. కేవలం తమ స్వప్రయోజనాల కోసం పార్లమెంటును నడపుతున్నారా అన్న భావన కులుగుతోంది. బొద్దింకలు చేపట్టిన ఆందోళన విరమణతో ప్రస్తుత సమస్య తాత్కాలికంగా సమసిపోతే పోవచ్చు. కానీ ప్రధాన వ్యవస్థలు తమ బాధ్యతను గుర్తించి మెలగని పక్షంలో మరో సమస్య వచ్చినప్పుడు ఆందోళనలు ఇంతకు మంచి ఊపందుకుంటాయి. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నందువల్లే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నాం. దానిని బలహీనపరచడమంటే ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుంది. వ్యవస్థలకు వ్యతిరేకంగా కాకుండా వాటిల్లో జవాబుదారీ తనాన్ని తీసుకురావడానికి పోరాడవలసిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది. కాక్రోచ్ జనతా పార్టీ కోరుతున్నది అదే కనుక నేతలు తమ పద్ధతిని మార్చుకుంటే మంచిది. ముఖ్యంగా రాజకీయ పార్టీలు కూడా ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒక సామాన్యుడైన అభిజీత్ దీప్కే ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీ వెనుక నిలబడడం ద్వారా కాంగ్రెస్ తదితర పార్టీలు ఓ రకంగా తమ ఉనికిని కోల్పోయానే చెప్పాలి. వారు చేయాల్సిన పనిని వారి పార్టీలు చేయలేకపోయాయి. ఈ దుస్థితి ఎందుకొచ్చిందో రాజకీయ పార్టీలు ప్రశ్నించుకోవాలి. సామాన్య ప్రజలు చేపట్టిన ఆందోళనకు దిగి రావాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో పాలకులు కూడా గ్రహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను, ప్రత్యర్థులను భయపెడుతూ ఎంతో కాలం మనుగడ సాగించలేమని పాలకులు గుర్తించాలి.

# ఎలిగేన్స్ ప్రీమియర్ లీగ్ సీజన్ 2 విజేత పవర్ స్ట్రైకర్స్

**బాలకృష్ణ సారథ్యంలో వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా పవర్ స్ట్రైకర్స్ ఘనవిజయం**

**లీగ్ నుంచి ఫైనల్ వరకు ఒక్క ఓటమి లేకుండా అద్భుత ప్రదర్శన**

**వికెట్ కీపింగ్‌లో నాగబాబు మెరుపులు... టోర్నీ బెస్ట్ కీపర్‌గా ప్రశంసలు**

**అత్యధిక పరుగులతో వినోద్, అత్యధిక వికెట్లతో దుర్గారావు సత్తా!**

**ఆల్‌రౌండర్ నరసింహ కీలక ప్రదర్శనతో జట్టు విజయాలకు బలమైన అండ**

**బండమందారంలోని శ్రీ వాసుదేవ క్రికెట్ గ్రౌండ్‌లో ఘనంగా ముగిసిన ఎలిగేన్స్ ప్రీమియర్ లీగ్--2 వేడుకలు**






**నీలగిరి వార్త కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి రమేష్ :**

బండమందారంలోని శ్రీ వాసుదేవ క్రికెట్ గ్రౌండ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఎలిగేన్స్ ప్రీమియర్ లీగ్ (ఈపీఎల్) సీజన్--2 ఘనంగా ముగిసింది. శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో ఐదు జట్లు క్రీడాస్ఫూర్తితో పోటీపడి అభిమానులకు ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లను అందించాయి. చివరికి బాలకృష్ణ నాయకత్వంలోని పవర్ స్ట్రైకర్స్ జట్టు అద్భుత సమిష్టి ప్రదర్శనతో వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలిచి తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది. లీగ్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించిన పవర్ స్ట్రైకర్స్ జట్టు ఎనిమిది పాయింట్లతో పట్టికలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. అత్యుత్తమ నెట్ రన్‌రేట్ నమోదు చేసిన ఈ జట్టు అనంతరం జరిగిన నాకౌట్ దశలోనూ అదే జోరును కొనసాగించింది. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌ల్లో ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యం చెలాయించి టోర్నీ మొత్తం ఒక్క ఓటమి కూడా లేకుండా విజేతగా అవతరించింది. టోర్నీలో మన్నే స్ట్రైకర్స్--11 జట్టు రన్నరప్‌గా నిలవగా, ద ఎలైట్స్ ఆఫ్ ఎలిగేన్స్, ఫియర్‌లెస్ వారియర్స్ (ఎంపీటీ), రాక్ స్టార్స్ జట్లు కూడా పోటీతత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రతి మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చాయి. జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోటీ ప్రేక్షకులను చివరి బంతి వరకు ఉత్కంఠలో ముంచెత్తింది. పవర్ స్ట్రైకర్స్ విజయానికి ఆటగాళ్ల సమిష్టి కృషే ప్రధాన బలంగా నిలిచింది. ఆల్‌రౌండర్ నరసింహ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కీలక ప్రదర్శన చేసి జట్టు విజయాల్లో ప్రధాన పాత్ర పోషించాడు. వినోద్ టోర్నీలో అత్యధిక పరుగులు సాధించి అత్యుత్తమ బ్యాట్స్‌మన్‌గా నిలవగా, దుర్గారావు అత్యధిక వికెట్లు పడగొట్టి బౌలింగ్ విభాగంలో తన సత్తాను చాటుకున్నాడు. ఇక వికెట్ల వెనుక నాగబాబు ప్రదర్శించిన చురుకుదనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెరుపువేగంతో చేసిన స్టంపింగ్స్, అద్భుత క్యాచ్‌లు, ఖచ్చితమైన వికెట్ కీపింగ్‌తో ప్రేక్షకులు, నిర్వాహకులు, సహచర ఆటగాళ్ల ప్రశంసలు అందుకున్న ఆయన టోర్నీ అత్యుత్తమ వికెట్ కీపర్ అవార్డును దక్కించుకున్నాడు. పవర్ స్ట్రైకర్స్ వరుస విజయాల్లో నాగబాబు పాత్ర విశేషమని క్రీడాభిమానులు కొనియాడారు. టోర్నీ మొత్తం యువ క్రికెటర్ల ప్రతిభ, జట్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ, క్రీడాస్ఫూర్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి మ్యాచ్ చివరి బంతి వరకు ఉత్కంఠ రేకెత్తించడంతో అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో ఇలాంటి టోర్నీలు కీలక పాత్ర పోషిస్తాయని పలువురు క్రీడాభిమానులు అభిప్రాయపడ్డారు. టోర్నీని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకుడు శ్రీనివాస్ యాదవ్తో పాటు కమిటీ సభ్యులను పాల్గొన్న జట్లు, క్రీడాకారులు, అభిమానులు అభినందించారు. భవిష్యత్తులో ఎలిగేన్స్ ప్రీమియర్ లీగ్ను మరింత ఉన్నత స్థాయిలో నిర్వహించి యువ క్రీడాకారులకు జాతీయ స్థాయి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

# ఉపసర్పంచ్‌ల ఫోరం నియామకాల్లో రాజకీయ జోక్యం తగదు: బీజేపీ మండల పార్టీ హెచ్చరిక

**అన్ని పార్టీలకు అతీతంగా ఫోరం ఉండాలి కానీ ఒంటెద్దు పోకడలు పోకూడదు**

**నవాబుపేట్ బిజెపి పార్టీ తరపున మండల అధ్యక్షుడు పిలుపుమేరకు ఖండిస్తున్నాం**

**నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట మండలం**



నవాబుపేట్ మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, ఇతర పదవుల నియామకాల్లో కాంగ్రెస్ నాయకులు రాజకీయ జోక్యం చేసుకోవడం సరైన విధానం కాదని బీజేపీ, మండల అధ్యక్షుడు, పార్టీ నాయకులు విమర్శించారు. పార్టీలకు అతీతంగా చర్చిద్దామని పిలిచి, అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులకే పదవులు కట్టబెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు.

ఈ మేరకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కిసాన్ మోర్చా నాయకులు సింగాపురం రమేష్ మాట్లాడుతూ, నవాబుపేట్ మండలంలో ఉపసర్పంచ్‌ల ఫోరం పేరుతో చేపట్టిన నియామక ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని ఆరోపించారు. ఉపసర్పంచ్‌లందరినీ ఒక వేదికపైకి తీసుకువచ్చి పార్టీలకు అతీతంగా పనిచేస్తామని చెప్పి, చివరికి ఒకే రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులకు పదవులు ఇవ్వడం సరికాదన్నారు. మండలంలో ఉపసర్పంచ్‌లకు సంబంధించిన ఏ సంఘం ఏర్పాటైనా అందరి అభిప్రాయాలు తీసుకుని, ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు వర్గాలుగా విడిపోయి పదవుల పంపకం చేయడం వల్ల స్థానిక సంస్థల ప్రతిష్ట దెబ్బతింటుందని అన్నారు. ఇలాంటి చర్యలను వెంటనే నిలిపివేయాలని, లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో ఉపసర్పంచ్‌లు దిరత్ రెడ్డి (నాగిరెడ్డిపల్లి), మహేందర్ (గొల్లగూడా), అనసూజా రంగయ్య గౌడ్ (చిట్టిగిద్ద), మండల బీజేపీ ఉపాధ్యక్షులు అంత మొల్ల భీమ్ రెడ్డి, ఇతర బీజేపీ నాయకులు అర్జున్ గౌడ్.పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఉపసర్పంచ్‌ల ఫోరం వ్యవహారాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని వారు కోరారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.



## శ్రీ మఠంలో వేదమంత్రాల మధ్య మృత్తికా బృందావన ఊరేగింపు

**మంత్రాలయం, జూలై 27 నీలగిరి వార్త**

మంత్రాలయం:ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం రోజున మృత్తికా బృందావనానికి బంగారు పల్లకి సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా అర్చకులు మృత్తికా బృందావనాన్ని వెండి ఉయ్యాలలో ఉంచి ప్రత్యేక పూజలు, మంత్రపుష్పం,

మంగళహారతులు ఇచ్చారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పం చేసిన బంగారు పల్లకిని వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ మఠం ప్రాంగణమంతా అశేష భక్తజనం సమక్షంలో ఊరేగించారు. ఈ దివ్య దృశ్యాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ మఠం అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ వ్యాసరాజస్వామి,శ్రీ మఠం సిబ్బంది, పాల్గొన్నారు.

# ఉపసర్పంచ్‌ల ఫోరం నియామకాల్లో రాజకీయ జోక్యం తగదు: బీజేపీ హెచ్చరిక

## అన్ని పార్టీలకు అతీతంగా ఫోరం ఉండాలి కానీ ఒంటెద్దు పోకడలు పోకూడదు

**నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట మండలం**



నవాబుపేట్ మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, ఇతర పదవుల నియామకాల్లో కాంగ్రెస్ నాయకులు రాజకీయ జోక్యం చేసుకోవడం సరైన విధానం కాదని బీజేపీ నాయకులు విమర్శించారు. పార్టీలకు అతీతంగా చర్చిద్దామని పిలిచి, అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులకే పదవులు కట్టబెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. ఈ మేరకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కిసాన్ మోర్చా నాయకులు సింగాపురం రమేష్ మాట్లాడుతూ, నవాబుపేట్ మండలంలో ఉపసర్పంచ్‌ల ఫోరం పేరుతో చేపట్టిన నియామక ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని ఆరోపించారు. ఉపసర్పంచ్‌లందరినీ ఒక వేదికపైకి తీసుకువచ్చి పార్టీలకు అతీతంగా పనిచేస్తామని చెప్పి, చివరికి ఒకే రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులకు పదవులు ఇవ్వడం సరికాదన్నారు.

మండలంలో ఉపసర్పంచ్‌లకు సంబంధించిన ఏ సంఘం ఏర్పాటైనా అందరి అభిప్రాయాలు తీసుకుని, ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు వర్గాలుగా విడిపోయి పదవుల పంపకం చేయడం వల్ల స్థానిక సంస్థల ప్రతిష్ట దెబ్బతింటుందని అన్నారు. ఇలాంటి చర్యలను వెంటనే నిలిపివేయాలని, లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో ఉపసర్పంచ్‌లు దిరత్ రెడ్డి (నాగిరెడ్డిపల్లి), మహేందర్ (గొల్లగూడా), అనసూజా రంగయ్య గౌడ్ (చిట్టిగిద్ద), మండల బీజేపీ ఉపాధ్యక్షులు అంత మొల్ల భీమ్ రెడ్డి, ఇతర బీజేపీ నాయకులు అర్జున్ గౌడ్.పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఉపసర్పంచ్‌ల ఫోరం వ్యవహారాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని వారు కోరారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

# వగరూరు లోని న్యూ బ్రిలియంట్ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం



**మంత్రాలయం, జూలై 27 నీలగిరి వార్త**

> **పదవ తరగతి చదివిన వ్యక్తితో విద్యార్థులకు బోధన...**
>
> **అర్హత లేని వారితో విద్యాబుద్ధులు**
>
> **విద్య హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నా వగరూరులోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం**
>
> **విద్యా హక్కు చట్టం ప్రకారం బి.ఈ.డి పూర్తి చేసిన వారితోనే విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సి ఉంది అయితే అందుకు భిన్నంగా**

మంత్రాలయం మండలం వగరూరు గ్రామంలోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం మాత్రం పదవ (10వ) తరగతి పాస్ అయిన ఓ వ్యక్తితో ఇంగ్లీష్ సబ్జెక్టు పై విద్యార్థులకు పాఠాలు చెప్పిస్తున్నారు. అంతేకాక ఈ పాఠశాలలో సుమారు 50 శాతం మంది ఉపాధ్యాయులు బిఈడి పూర్తికానివారే పాఠాలు బోధిస్తున్నారు. ఇంత జరుగుతున్న విద్యాశాఖ అధికారులు కళ్ళు మూసుకొని ఉండడంతో విద్యాహక్కు చట్టానికి తూట్లు పడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పాఠశాల యాజమాన్యం సద్దాం హుస్సేన్ ని వివరణ కోరగా మా దగ్గర పదవ తరగతి పాస్ అయిన ఒక వ్యక్తి ఇంగ్లీష్ సబ్జెక్టు చెప్తున్నారని మరో ముగ్గురు డిగ్రీ అయిన వారు ఉన్నారని మిగిలిన నలుగురు టి.టి.సి చేసిన వారు ఉన్నారని అయితే మా సిబ్బంది బిఈడి క్వాలిఫై అయిన వారితో సమానంగా పాఠాలు చెబుతారని తెలిపారు.

# సర్కార్ ఆఫీసులో మౌలిక వసతులు కరువు

**సదాశివనగర్ తాసిల్దార్ కార్యాలయంలో బాత్రూంల్ లేక అవస్థలు పడుతున్న ఆఫీసర్లు మరియు ప్రజలు**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**




కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల కేంద్రంలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్న ఆఫీసర్లు ప్రజలు తాసిల్దార్ కార్యాలయంలో బాత్రూంల్ మరియు గదులు లేక అవస్థలు పడుతున్నారు. తాసిల్దార్ కార్యాలయం పక్కన మూతపడ్డ పాత భవనం ఉండడం అది పూర్తిగా కూల్చివేయాలని స్థానికులు పేర్కొంటున్నారు. అక్కడి నుండి విషపురుగులు మరియు నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని తాసిల్దార్ కార్యాలయంలో ఇరుకైన గదులతో ఇబ్బందికర వాతావరణం నెలకొందని స్థానికులు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల స్పందించి స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో మౌలిక వసతులు కల్పించాలని తాసిల్దార్ పక్కన మూతబడ్డ భవనాన్ని పూర్తిగా కూల్చివేయాలని. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో సదాశివనగర్ తాసిల్దార్ సిబ్బంది చురుగ్గా పనిచేయడం అభినందనీయమని మండల ప్రజలు అభిప్రాయపడ్డారు. చుట్టుపక్కల నుండి వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని స్థానికులు కోరుతున్నారు. సదాశివ నగర్ తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ సత్యనారాయణ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుంటూ వారి సమస్యలను పరిష్కరించడంతోపాటు సిబ్బంది కూడా రేషన్ కార్డు. కులం సర్టిఫికెట్. ఆదాయం సర్టిఫికెట్. రెసిడెన్సి సర్టిఫికెట్. ఇతర సర్టిఫికెట్ కోసం వచ్చిన ప్రజలకు తాసిల్దార్ సిబ్బంది అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడం పట్ల మండల ప్రజలు స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

# విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తాం..వైసీపీ మండల అధ్యక్షులు జీ.భీమిరెడ్డి



**మంత్రాలయం, జూలై 27 నీలగిరి వార్త**

మంత్రాలయం: రాంపురం రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి,వైసిపి నాయకులు జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిలకలడోన కేజీబీవీ పాఠశాలలో ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పదవ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన హెచ్. దీపిక(569), యం. రాజేశ్వరి(552) ఇద్దరు విద్యార్థినిలకు రూ 5 వేల రూపాయల చొప్పున రూ 10 నగదును పాఠశాల ప్రిన్సిపాల్ శాంతి, రామకృష్ణవేణి, భ్రమరాంబ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉపకరణాల పంపిణీ చేసిన సొసైటీ ఛైర్మన్ ఏన్.రామకృష్ణారెడ్డి



**మంత్రాలయం,జూలై 27 నీలగిరి వార్త**

మంత్రాలయంటీడీపీ ఇంచార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు మంత్రాలయం సొసైటీ ఛైర్మన్ ఎన్. రామకృష్ణ రెడ్డి స్కూల్ ఆవరణం లోని సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో అలింకో ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వివిధ రకాల ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గత నెల డిసెంబర్ లో నిర్వహించిన వైకల్య నిర్ధారణ కార్యక్రమం ఆధారంగా,ప్రత్యేక అవసరాలు గల పిల్లల వైకల్యానికి అనుగుణంగా వారికి అవసరమైన ఉపకరణాలను గుర్తించిఎన్.రామకృష్ణ రెడ్డి చేతుల మీదుగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మొత్తం 30 రకాల ఉపకారణాలు వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, రోలేటర్లు, స్ట్రక్చర్స్, సీపీ వీల్‌చైర్లు, ఫోల్డింగ్ వీల్‌చైర్లు తదితర ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ వరదరాజులు, వెంకటేష్ మండల విద్యాశాఖ అధికారులు, సీఆర్ఎంటీలు నరసన్న గౌడ్, బంగారప్ప, భీమేష్, కళ్యాణి, శివప్రసాద్,లలిత,, మళ్ళి, క్లస్టర్ ఇంచార్జి పవన్, డి సి.తిమ్మప్ప,మేకల నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి ఇంకుడు గుంత.. నీటి సంరక్షణకు అందరూ తోడ్పడాలి

**స్పెషల్ ఆఫీసర్ ఎం. రాజశేఖర్ పిలుపు**

**గట్టుప్పల్: నీలగిరి వార్త ప్రతినిధి, జూలై 27:**



భవిష్యత్ తరాలకు నీటి కొరత రాకుండా ఇప్పటి నుంచే వర్షపు నీటిని సంరక్షించే చర్యలు చేపట్టాలని మండల స్పెషల్ ఆఫీసర్ ఎం. రాజశేఖర్ అన్నారు. విబీజీ రామ్–జీ జలసిరి పథకం ఆధ్వర్యంలో సోమవారం గట్టుప్పల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత.. పంటకు పంటకుంట.. ఊరికి ఊటకుంట' అనే నినాదాన్ని ప్రతి గ్రామంలో ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేస్తే భూగర్భ జలాలు పెరిగి తాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. నీటి సంరక్షణలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వి. హిమాబిందు, ఎంపీవో సునీత, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సర్పంచ్‌లు నామని జగన్నాథం, సింగం వెంకటేశ్వర్లు, చందా శ్రీలత, రావుల స్వప్న, మెరుగు సాలమ్మ, పంకర్ల ప్రభాకర్, భీమనపల్లి రామయ్య, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విబీజీ రామ్–జీ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు నగదు రు. 5001 బహుమతులు అందజేత.

**నీలాగిరి వార్త నారాయణఖేడ్ జులై 27 :**



మరో ఎన్నికల హామీ నెరవేర్చిన దోసపల్లి సర్పంచ్ బిరదర్ దత్తు.... మనూరు మండల పరిధిలోని దోసపల్లి గ్రామ సర్పంచ్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బీరధర్ దత్తు మరొక హామీ నెరవేర్చారు సర్పంచ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నారు సోమవారం దోసపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2025”2026 జడ్.పి.హెచ్.ఎస్ మనూరు పాఠశాలలో చదివి ఉత్తీర్ణత సాధించిన గ్రామానికి చెందిన బిరదర్ అపర్ణ మొదటి బహుమతి ?5100 బిరదర్ శ్రీనిజ రెండవ బహుమతి?2500 నగదు అందజేశారు విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు శాలువా మెమొంటో తో సత్కరించారు సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు సర్పంచ్ బిరదర్ దత్తు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి విద్యార్థులపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశయాలను నెరవేర్చి ఉన్నంత శిఖరాలు అధిరోహించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలు . డాక్టర్ అమృత్. గ్రామస్తులు రాజశేఖర్ . అశోక్. సత్యనారాయణ. నారాయణ.రాజ్ కుమార్. రవికుమార్. జయరాజ్. గ్రామస్తులు పాల్గొన్నారు

# డైరీ విద్యార్థులకు నాణ్యమైన నూతన విద్యా విధానం అమలు చేయాలి

**వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ జ్ఞాన ప్రకాష్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**



తెలంగాణలోని తొలి ఏకైక డైరీ టెక్నాలజీ కళాశాలను సోమవారం రోజున సందర్శించిన వైస్ ఛాన్సలర్ డాక్టర్ జ్ఞాన ప్రకాష్, ఆయనతోపాటు రిజిస్టర్ డాక్టర్ శరత్ చంద్ర కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కళాశాలలోని అన్ని విభాగాలను తనిఖీలు చేశారు. కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కళాశాలకు కావలసిన అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పాటు అందిస్తామని వారు తెలియజేశారు. కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యార్థి విద్యార్థులకు నాణ్యతతో కూడిన నూతన విద్యా విధానాన్ని అనుగుణంగా విద్యా మరియు పరిశోధన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ జ్ఞాన ప్రకాష్, పశువైద్య కళాశాల రిజిస్టర్ డాక్టర్ శరత్ చంద్ర, డీన్ డాక్టర్ ఉదయ్ కుమార్, విద్యార్థి విభాగ మధిపతి డాక్టర్ సతీష్ కుమార్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సురేష్ రాథోడ్, ఉమాపతి ఇతర అధ్యాపకులు కళాశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును కాపాడుకోవాలి

**దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

**దేవరకొండ నీలగిరి వార్త**



దేవరకొండ మండలం, ఉమ్మడి ముదిగొండ ఎమ్మెల్యే సొంత గ్రామం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, బీఎల్ఓలు బి ఎల్ ఓ లు బీఎల్ఏల తో నిర్వహించిన ప్రక్రియపై అవగాహన సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును తప్పకుండా కాపాడుకోవాలని అన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలను పారదర్శకంగా, కచ్చితంగా రూపొందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు సర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని, 100 శాతం వరకు అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొత్తగా అర్హత పొందిన వారి పేర్లు నమోదు చేయించడం, తప్పుగా తొలగించబడిన పేర్లను పునరుద్ధరించడం, అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించడం వంటి అంశాలపై ప్రజలకు మార్గనిర్దేశం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమని, ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలిచి సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మార్పాకుల సురేష్ గౌడ్ , సూర్య తండా సర్పంచ్ నేనావత్ కవిత లచ్చిరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# దారుణం.. నాలుగేళ్ల బాలికపై 50 ఏళ్ల వ్యక్తి అత్యాచారం.

**వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలో చోటు చేసుకున్న ఘటన.**

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**




ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికకు మాయమాటలు చెప్పి.. లైంగిక దాడికి పాల్పడ్డ భాస్కర్(50) బాలిక జరిగిన విషయం తల్లికి చెప్పడంతో.. నిందితుడు భాస్కర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుపోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడు పరారీలో ఉండటంతో గాలింపు. భాస్కర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నట్టు వెలుగులోకి! ఈ కేసుని నీరుగార్చేందుకు కొందరు పెద్ద మనుషులు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.

# చిలుకవాగు ప్రాజెక్టుకు మరో రూ.30 కోట్లు

**తాండూరు, జూలై 27 :**



తాండూర్ మున్సిపల్ పరిధిలోని నిర్మాణంలో ఉన్న ప్రతిష్టాత్మక చిలుకవాగు ప్రాజెక్టుకు అదనంగా రూ.30 కోట్ల నిధులకు ప్రభుత్వం ఆర్థిక అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక జీవోను విడుదల చేసింది.

చిలుకవాగు ప్రాజెక్టుకు అదనపు నిధుల మంజూరు కోసం తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గత వారం రోజుల క్రితం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కని మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు పనులు వేగవంతంగా పూర్తయ్యేందుకు అదనపు నిధులు మంజూరు చేయడంతో పాటు, త్వరితగతిన ఆర్థిక అనుమతులు జారీ చేసి సంబంధిత జీవో విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు.

ఎమ్మెల్యే విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం తాజాగా రూ.30 కోట్ల అదనపు నిధులకు ఆర్థిక అనుమతులు జారీ చేస్తూ అధికారిక జీవోను విడుదల చేసింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ చిలుకవాగు ప్రాజెక్టుకు అదనంగా రూ.30 కోట్ల నిధులు మంజూరు కావడం తాండూర్ ప్రజలకు ఎంతో శుభవార్త అని, ఈ నిధులతో ప్రాజెక్టు పనులు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు. తాండూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కి, ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు కి తాండూర్ ప్రజల తరఫున ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ చొరవతో పాత బజార్ కొత్త శోభ సంచరించబోతుంది.

**దేవరకొండ నీలగిరి వార్త**



దేవరకొండ పట్టణంలోని పాత బజార్లో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ చొరవతో రూపురేఖలు మారబోతున్నాయని దేవరకొండ మున్సిపల్ చైర్ పర్సన్ వైస్ చైర్ పర్సన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అంగడి బజారు పశు ల సంత వ్యాపారాలకు నిలువైన పాత అంగడి బజార్ గాంధీ బజార్ కూరగాయల మార్కెట్ వ్యాపారాలతో జన సందడితో కళకళలాడేవని నేడు పెరుగుతున్న ఊరు దృష్ట్యా బస్టాండు మార్కెట్ మీనాక్షి సెంటర్ కు వ్యాపారాలని చేరుకున్నాయని దీంతో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోకుండా గత 20 సంవత్సరాల నుండి ఇక్కడ వ్యాపారం చేస్తున్నటువంటి వ్యాపారులు సైతం నిరాశకు గురైవుతున్నారు. ఈ విషయాన్ని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రత్యక్షంగా పలువురుతో అధ్యయనం చేసి బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద రెండు కోట్ల రూపాయలతో వరకు రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని పై బాగానే ఉన్నా తాసిల్దార్ కార్యాలయం మున్సిపల్ కార్యాలయాన్ని నూతన నిర్మాణం చేపడం కోసం ప్రతిపాదనలు పంపడంతో గాంధీ బజార్ ఖిల్లా బజార్ ప్రజలలో కొత్త ఆశలు చిగురించాయని తద్వారా త్వరలో ప్రారంభం కాబోయే వివిధ కార్యాలయాలు తోపాటు పాత పోలీస్ స్టేషన్ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయని ఎంతోకాలంగా ఫారెస్ట్ ఆఫీసు నుండి ముత్యాలమ్మ వీధి వరకు ప్రధాన రహదారి సిసి రోడ్డు పనులు సైతం వేగంగా జరుగుతుండడంతో పాత బజార్ లోని ప్రజలు ఎమ్మెల్యే మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ మరింత అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేయాలని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సంజయ్ కాలనీ వృషభద్రి దేవాలయంలో ఆషాడ మాసం గోరింటాకు సంబరాలు

**దేవరకొండ నీలగిరి వార్త**



దేవరకొండ పట్టణంలోని సంజయ్ కాలనీ వృషభద్రి దేవాలయంలో ఆదివారం ఆషాడ మాసం గోరింటాకు సంబరాలు అంబరాన్ని అంటాయి. సంజయ్ కాలనీ ఉషబాద్రి దేవాలయంలో మహిళా కమిటీ ఆధ్వర్యంలో మహిళలు గోరింటాకును పెట్టుకొని గోరింటాకు ప్రాముఖ్యతను తెలియజేశారు .ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలలో గోరింటాకు ఒక ప్రత్యేకమైనటువంటి స్థానం ఉందని మహిళలు ఏడాది పొడుగునా ఎండ వేడితో శరీరం ఉంటుందని గోరింటాకు వల్ల శరీరంలో ఉన్నటువంటి అనేక కణాలు చల్లబడతాయని తద్వారా సైంటిఫిక్ గా గోరింటాకు ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తుందని అన్నారు . ప్రతి సంవత్సరం ఇదే తరహాలో తమ మహిళలు గోరింటాకు సంబరాలు జరుపుకుంటామని తెలిపారు. గోరింటాకు ప్రతి మహిళ ఎంతో ఇష్టంతో పెట్టుకోవడంతోపాటు చిన్న పెద్ద తేడా లేకుండా ఆషాడ మాసంలో జరుపుకునే గొప్ప పండుగ గోరింటాకు పండుగ అని తెలిపారు .ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రూ.270 కోట్ల రహదారి అభివృద్ధి పనులపై మంత్రి శ్రీధర్ బాబు

**నీలగిరి వార్త కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి రమేష్ :**





కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రూ. 270 కోట్ల రూపాయలతో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు కుత్బుల్లాపూర్ నియోజక వర్గ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ తో కలిసిఅధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగింది. కొంపల్లి--బహదూర్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు 130 కోట్లు మరియు గండి మైసమ్మ--మియాపూర్ రోడ్డు నిర్మాణ పనులకు 140 కోట్ల రూపాయలు మొత్తంగా 270 కోట్లు రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి అధికారులకు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గత దశాబ్ద కాలంగా అటవీ శాఖ అనుమతులు లభించక ఈ రోడ్డు పనులు నిలిచిపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన అనుమతులు త్వరితగతిన లభించేలా చర్యలు తీసుకుని పనులను ప్రారంభించామని తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి ఈ రెండు రహదారి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, పనుల వివరాలను పరిశీలించారు.

ఈ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గనున్నాయని అధికారులు తెలిపారు.

సందర్భంగా మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు , జిల్లా కలెక్టర్ మను చౌదరి ,సిఎంసీ కమిషనర్ సృజన ,వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతొ పాటు మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ,కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హనుమంత్ రెడ్డి , భూపతి రెడ్డి ,బొంగునూరు శ్రీనివాస్ రెడ్డి , మాజీ కార్పొరేటరలు, డివిజన్ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్లు,మాజీ సర్పంచ్ లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## గుట్ట ప్రభుత్వ పాఠశాలకు రక్షణ చర్యలు చెప్పటండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



**నీలగిరి వార్త కుత్బుల్లాపూర్ ప్రతినిధి టి రమేష్ :**

నేడు ప్రజావాణి సందర్భంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో జగద్గిరిగుట్ట మరియు గాజుల రామారం డివిజన్ సమస్యలపైన అధికారులను కలిసి రోడ్డు అక్రమ పార్కింగ్ మరియు ప్రభుత్వ పాఠశాల రక్షణ కొరకు చర్యలు చేపట్టాలని ఈ ఈ గోవర్ధన్ మరియు బద్రి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు వారాల క్రితం జరిగిన ప్రజావాణిలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ గారికి జగద్గిరిగుట్టలో రోడ్డు ఆక్రమణలు ఫుట్పాత్ నిర్మాణం మరియు గాజులరామారం డివిజన్లోని రోడ్డు బాగు కొరకు వినతి పత్రం ఇస్తే ఇప్పటివరకు అధికారుల నుండి ఎలాంటి స్పందన లేదని ఇప్పటికైనా స్పందించకపోతే ప్రజావాణి ఎందుకని అధికారులను ప్రశ్నించారు. అదేవిధంగా జగద్గిరిగుట్ట ఉన్నత పాఠశాలలో ప్రహరీ గోడ చిన్నగా ఉండడం వల్ల రాత్రి సమయంలో సెలవు దినాల్లో ఆకతాయిలు వచ్చి పాఠశాల వాతావరణాన్ని చెడగొడుతున్నారని కావున ప్రహరీ గోడ ఎత్తును పెంచాలని కోరడం జరిగింది. పై సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఉద్యమం చేయాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, మండల కార్యదర్శి స్వామి,సహాయ కార్యదర్శులు హరినాథరావు రాములు యువజన సంఘం నాయకులు కీర్తి ప్రవీణ్ మరియు ఇమామ్ జంబులు పాల్గొన్నారు.

# తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

### ఆగస్టు 1 నుంచి రాష్ట్రంలో అమలు.. డిసప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి



అమరావతి,జూలై27(ఆర్ఎన్ఎ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుడ్ న్యూస్ చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఏపీ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరగనున్నట్లు పవన్ పేర్కొన్నారు. బీపీటీ సూపర్ ÷న్ బియ్యం కేజీ రూ. 52, పచ్చి బియ్యం కేజీ రూ. 50కి అందజేయడంతో సామాన్యులకు ఊరట లభించనుందని తెలిపారు. ఏపీ ప్రజలకు అండగా ఉండేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంవో కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. 'కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా ఏపీ పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యులకు సాంత్వన చేకూర్చేలా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టడం హర్షణీయం. ఆగస్టు 1 నుంచి ఏపీలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో బియ్యం అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. బీపీటీ సూపర్ Zaన్ బియ్యం కేజీ రూ. 52కు, గ్రేడ్-1 పచ్చి బియ్యం కేజీ రూ. 50కి అందించనున్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. సామాన్యులపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నా. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్షించి, మిల్లర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించాం. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనాపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని విశ్వసిస్తున్నా' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు

### వరుసపెట్టి దాడులు చేస్తున్న ఎసిబి.. వందల కోట్లలో అక్రమాస్తుల గుర్తింపు



హైదరాబాద్,జూలై27 : రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ మరోమారు కొరడా ఝుళిపిస్తోంది. ఇటీవలి కాలంలో వరుసపెట్టి పెద్దపెద్ద చేపలను పట్టేస్తోంది. చిన్నాచితక కేసులు నమోదు అవుతున్నా, పెద్ద చేపల విషయంలో ఎసిబి పక్కాగా సమాచారం సేకరించి దాడులు చేస్తోంది. దాడుల్లో వందల కోట్ల ఆస్తులను గుర్తించి సీజ్ చేస్తోంది. అవినీతి పట్ల ప్రభుత్వం కూడా కఠినవైఖరి అవలంబిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజలతో నిత్యం సంబంధం ఉండే శాఖల్లో అవినీతి ఎక్కువగా ఉందనే ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ ఆయా శాఖల అధికారులపై దృష్టి కేంద్రీకరించింది. ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులు, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ విభాగాల నుంచి అందిన సమాచారం ఆధారంగా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన 100 మంది అధికారులపై నిఘా కొనసాగుతోంది.

ఇప్పటికే 65 మంది అధికారులపై ప్రాథమిక స్థాయిలో సమాచారం సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది.

ఏసీబీ దృష్టిలో అత్యధికంగా రెవెన్యూ, పోలీస్, జీహెచ్ఎంసీ, ఆర్టీఏ, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ శాఖలు ప్రజలకు నేరుగా సేవలు అందించే విభాగాలు కావడంతో లంచాలు, అక్రమ లావాదేవీలకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గతంలో వచ్చిన ఆరోపణలు సూచించాయి.

కేవలం ఫిర్యాదుల ఆధారంగా కాకుండా గత ఆరు నెలలుగా అనుమానిత అధికారుల ఆర్థిక లావాదేవీలు, స్థిరాస్తులు, బ్యాంకు ఖాతాలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తులు, బినామీ లావాదేవీలు వంటి అంశాలపై ఏసీబీ నిఘా పెట్టినట్లు సమాచారం. దీని కోసం వీడియో రికార్డింగ్‌లు, డాక్యుమెంటరీ ఆధారాలు, రిజిస్ట్రేషన్ వివరాలు, బ్యాంకింగ్ లావాదేవీలు వంటి సాక్ష్యాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. పక్కా ఆధారాలు లభించిన తర్వాతే దాడులు, కేసులు నమోదు చేసే విధానాన్ని ఏసీబీ అనుసరిస్తోంది.

ఇటీవలి కాలంలో ఆదాయానికి మించిన ఆస్తులు కేసుల్లో పలువురు ప్రభుత్వ అధికారులపై కేసులు నమోదు చేసిన ఏసీబీ ఇప్పటికే 10 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సమాచారం. ఈ చర్యలు మిగతా అధికారుల్లోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. అవినీతిని ఏ మాత్రం ఉపేక్షించబోమని ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీకి స్వేచ్ఛ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. శిక్షలు కఠినంగా ఉంటేనే మిగతా అధికారులకు హెచ్చరికగా నిలుస్తాయని ప్రభుత్వ పెద్దలు కూడా అభిప్రాయపడినట్లు సమాచారం. అవినీతిని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత ముఖ్యమైనది. లంచం డిమాండ్ చేసిన అధికారులు లేదా అక్రమాస్తులపై విశ్వసనీయ సమాచారం ఉంటే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ లేదా ఇతర అధికారిక మార్గాల ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారులు తరచూ సూచిస్తున్నారు. అవినీతి కేసుల్లో దాడులు నిర్వహించడం ఒక దశ మాత్రమే. అనంతరం ఆస్తుల మూలాలను నిరూపించడం, కోర్టులో బలమైన సాక్ష్యాలను సమర్పించడం, చివరకు శిక్షలు పడేలా చేయడం మరింత కీలకమైన ప్రక్రియ. గతంలో కొన్ని కేసులు సాక్ష్యాల లేమితో బలహీనపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల ఈసారి పక్కా ఆధారాలతోనే ముందుకు వెళ్లాలని ఏసీబీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.



# ఇంద్రకీలాద్రిపై ఆషాఢ ఉత్సవాలు

### శాకంబరిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ

విజయవాడ,జులై 27(ఆర్ఎన్ఎ): ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ సన్నిధిలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా వివిధ రకాల ఆకుకూరలు, పండ్లు, కూరగాయల అలంరాంతో దుర్గమ్మ దర్శనమిస్తున్నారు. మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణమంతా కూరగాయలతో అలకరించారు. ఆషాఢ మాసంలో ప్రత్యేకంగా శాకంబరీ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సకాలంలో వర్షాలు పడి, పాడిపంటలు పండి, దేశం సస్యశ్యామలంగా ఉండేందుకు ప్రతి ఏడాది శాకంబరీ ఉత్సవాలను నిర్వహిస్తారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో శాకంబరీ దేవిగా దుర్గమ్మ దర్శనమిస్తారు. ఉత్సవాల సందర్భంగా దుర్గమ్మ సన్నిధికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జై దుర్గా.. జై జై దుర్గా నామస్మరణతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. అమ్మవారి ఒంటి మీద నుంచి తీసిన శాఖాలతో కదంబ ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు పంపిణీ చేస్తారు. కదంబ ప్రసాదాన్ని స్వీకరిస్తే అనారోగ్యాలు పోయి ఆరోగ్యంగా ఉంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివస్తుండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# రేపు కృష్ణా కాలనీలో గురుపౌర్ణమి వేడుకలు.

## పోస్టర్లు ఆవిష్కరించిన సభ్యులు.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



వరంగల్ స్టేషన్ రోడ్డులోని శ్రీకృష్ణా కాలనీ సాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో ఈ నెల 29న బుధవారం 36వ సంవత్సరం గురుపౌర్ణమి వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు త్రోవగుంట వెంకటరమణ వెల్లడించారు. ఈ మేరకు కమిటీ సభ్యులతో కలిసి సోమవారం కృష్ణా కాలనీలో గురుపౌర్ణమి వేడుకల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. బుధవారం ఉదయం 6నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు "ఓంసాయి శ్రీసాయి జయ జయ సాయి" అనే ఏకనామ యజ్ఞము 24 గంటల పాటు భక్తుల చేత నిర్విరామంగా చేయబడుతుందన్నారు. ఉదయం నగర సంకీర్తన, గణపతి, చండీ, దత్త, సద్గురువు సాయి హోమాలు అనంతరం మహాన్నదానం ఏర్పాటు చేసినట్లు వెంకటరమణ వివరించారు. మహా నగరంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై అభిషేకాలు, భజనలు, హోమాలలో పాలు పంచుకొని సాయిని దర్శించుకొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బండారి రమేష్, దేవునూరి నాగరాజు, అమరవాది శ్రీనాథ్, కె.సాంబరాజు, ఫణి భూషణ్, ఎం.నర్సయ్య, చకిలం ఏకాంబరం, కోలా రాజు, కె.రాజ్ కుమార్, రాజేష్, కె.శివ, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉర్సు శ్రీ బీరన్న బోనాల ఉత్సవాలకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు.

ఆలయ చైర్మన్ మరుపల్ల రవి.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



తొలి ఏకాదశి మహా పర్వదినం న జరిగిన ఉర్సు శ్రీ బీరన్న స్వామి బోనాల జాతర ఉత్సవములు జయప్రదం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి శ్రీ బీ రన్న స్వామి దేవాలయం చైర్మన్ మరుపల్ల రవి కృతజ్ఞతలు తెలియజేసినారు బోనాల జాతర సందర్భంగా భక్తులు హుండీలో వేసిన కట్న కానుకలను సోమవారం రోజున లెక్కించడం జరిగిందని హుండీల లెక్కింపులో 34 వేల 356 రూపాయలు వచ్చినాయన్నారు శాంతి భద్రతలను పరిరక్షించడానికి కి విచ్చేసిన పోలీసు అధికారులకు సిబ్బందికి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ మొరం చల్లుట పారిశుధ్య పనులు చేపట్టడం చేసిన వరంగల్ మహానగరపాలక సంస్థ సంబంధిత అధికారులకు చైర్మన్ మరుపల్ల రవి కృతజ్ఞతలు తెలియజేసినారు హుండీ లెక్కింపులో చైర్మన్ మరుపల్ల రవి "ధర్మకర్తలు మిరియాల కుమార్ స్వామి 'మండల ప్రమీల' గౌడ కోటేశ్వర్' మరుపల్ల గౌతం ' కొలుపుల కోటేశ్వర్ 'పూజారి బలభద్ర భాస్కర్ లు ఉన్నారు.

# తల్లి తండ్రి లేని ఇద్దరు పిల్లలకు వాక్ ఫౌండేషన్ ద్వారా.

24 వేలు రూపాయిలు ఆర్థిక సహాయం అందించిన. డాక్టర్ వన్నాల వెంకట రమణ.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

వరంగల్ 28 వ డివిజన్ కి చెందిన విశ్వ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఉపుల సతీష్, స్రవంతి దంపతులు 4 సంవత్సరంల క్రితం బలన్మరణం చెందటంతో వారి పిల్లలైన మాస్టర్ విహాన్, మాస్టర్ విరాట్ ల చదువుల నిమిత్తం 10 వ తరగతి పూర్తి అయ్యేవరకు వాఖ ఫౌండేషన్ ద్వారా బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ సోమవారం వారి కుటుంబానికి 12 వేల చొప్పున ఇద్దరు పిల్లలకు 2 చెక్కులను 24 వేల రూపాయలను వెనిశెట్టి రోహిత్ 28 వ డివిజన్ కార్యాలయంలో అందించారు.వాక్ ఫౌండేషన్ ద్వారా సుమారు 500 పై చిలుక కుటుంబాలకు నెలకు 10 కిలోల బియ్యం, పలు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, వారి కంటి చూపు కొరకు ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని. అంతేకాకుండా తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లల చదువుల కొరకు ఆర్థిక సాయం, ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది అని వారు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సముద్రాల పరమేశ్వర్ , పొట్టి శ్రీనివాస్ , వెనిశెట్టి రోహిత్ , ముంద్రటి వెంకటేశ్వర్లు , కుచన క్రాంతి , అపురూప రజనీష్ నేత , బొడ్డు రాకేష్ , అశోక్ , అయ్యగారు శ్రీను, మండ్లోజు జగన్ , మరాఠీ శ్రీకాంత్ , బంటి , రమేష్ 28 డివిజన్ బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా.

డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు నియామకం.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ సంస్థాగత విస్తరణలో భాగంగా.., టిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రేటర్ వరంగల్, సూర్యాపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు నూతన జిల్లా అధ్యక్షులను నియమిస్తూ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా టిఆర్ఎస్ సీనియర్ నాయకులు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావును నియమిస్తూ పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి నియామక పత్రాన్ని విడుదల చేశారు. గ్రేటర్ వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాలతో పాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 66 డివిజన్లలో పార్టీ కార్యకలాపాలను డాక్టర్ వెంకటేశ్వర్ రావు పర్యవేక్షించనున్నారు.నియామక ఉత్తర్వులు వెలువడిన అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత కల్వకుంట్ల కవితకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వర్తిస్తూ పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను గ్రామ గ్రామాన, డివిజన్ డివిజన్‌లో ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. గ్రేటర్ వరంగల్‌లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసి, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక డివిజన్లలో విజయాన్ని సాధించి, మెజార్టీ సీట్లను గెలుచుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని డాక్టర్ వెంకటేశ్వర్ రావు స్పష్టం చేశారు. పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లి, గ్రేటర్ వరంగల్‌లో బలమైన రాజకీయ శక్తిగా నిలబెట్టేందుకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ విస్తరణకు కృషి చేస్తూ, అధికారమే లక్ష్యంగా –పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి కావడమే ధ్యేయంగా పార్టీ శ్రేణులతో కలిసి నిరంతరం పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

# శ్రీ భద్రకాళి శాకంబరి నవరాత్రుల్లో భాగంగా 13వ రోజు.









## మాత్ర నర్వమంగళ రూపాల్లో అలంకరణ దర్శనం.

## అమ్మవారిని దర్శించుకున్న శ్రీనివాస మంగాపురం చిత్రం యూనిట్ సభ్యులు.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు పదమూడవ రోజుకు చేరుకున్నాయి ఉదయం గం॥ 05–00లకు నిత్యాహ్నికం పూర్తిచేసిన పిమ్మట తిథిమండల దేవతా యజనంలో భాగంగా కాళీ క్రమాన్ననుసరించి అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని మాత్రా గాను షోడశీ క్రమాన్ననునరించి జ్ఞానశక్తిని నర్వమంగళ గాను అలంకరించి పూజారాధనలు జరిపారు. దశమహావిద్యలలో అద్యవిద్యయైన కాళీ సపర్యాక్రమంలో త్రయోదశికి అధిదేవత మన్మథుడు. పంచతన్మాత్రల నుండి పంచభూతములు పుట్టినవి. పంచభూతముల యందు అనగా ఆకాశ, వాయు, తేజో, జల, పృథ్వీ యందు వాటి సూక్ష్మాంతరములైన గుణములు వరుసగా శబ్ద, స్పర్శ, రూప, గంధముల రూపమున అమ్మవారు వ్యాపించి యున్నది. అట్టి సమస్త జీవుల నర్వేంద్రియుల యందు ఆధార శక్తియై అమ్మవారు వ్యాపించి యున్నది. అట్టి అమ్మవారి యొక్క ఒక్క విభూతియే ఈ మాత్రా నర్వమంగళా నిత్యా అమ్మవారు భక్తులకు నమస్త మంగళములను, శుభములను ప్రాప్తింపజేస్తుందని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు.బుధవారం రోజున తెల్లవారుజామున గం॥ 03–00ల నుండి నిత్యాహ్నికం నిర్వర్తించబడిన అనంతరం అమ్మవారికి వలువిధములైన శాకములతో శాకంభరీ అలంకారము ప్రారంభమగును. ఇట్టి అలంకారము ఉదయం గం॥ 09–00ల వరకు జరుగును అలంకారము జరుపుచున్న సందర్భములో భక్తులు అమ్మవారిని దర్శించుకొనుట వీలుపడదు. అమ్మవారి అలంకారమునకు సుమారు 6 గంటల వ్యవధి పట్టును అలంకారము జరుపుచున్న సందర్భములో అమ్మవారిని దర్శించుకొనుటకు వీలుకాదు. అలంకారము జరుపబడిన పిమ్మట పూజానంతరం ఉదయం గం॥ 09–00ల నుండి నర్వదర్శనమునకు భక్తులను అనుమతించబడును, భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు విశిష్ట దర్శనం, అతి శీఘ్రదర్శనం. ధర్మ దర్శనం క్యూలైన్లు యథాపూర్వం ఏర్పాటు చేయడమైనది. దివి: 29–07–2026 బుధవారం రోజున ఉదయం గం॥ 09ల తదుపరి మాత్రమే భక్తులకు శ్రీ భద్రకాళీ అమ్మవారి శాకంభరీ విశ్వరూప దర్శనం ప్రారంభమై రాత్రి వరకు ఉండును ఈ సందర్భంగా భక్తుల రాకను పురస్కరించుకొని చేయవలసిన భద్రతా, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లు మట్వాడ సి.ఐ శ్రీ కరుణాకర్, ఎస్ ఐలు తదితర పోలీసు సిబ్బందితో ఈ రోజు ఈ.ఓ రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు, హరనాథ్ లు పరిశీలించారు తేది: 29–07–2026 బుధవారం రోజున ఉదయం గం॥ 11–00లకు వ్యాస పూజ, మహాపూర్ణాహుతి, బలిప్రదానం, అవబృథంతో శాకంభరీ ఉత్సవ పరిసమాప్తి జరుగుతుంది.

సోమవారం అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాడర్ సీనియర్ ఐ.ఏ. ఎస్ అధికారి సునీత, ఐ.ఏ. ఎస్ దంపతులు నందర్శించారు. ఆలయానికి విచ్చేసి, సునీత, ×ూూ గారికి ఆలయ ఈ.ఓ రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు ఘనస్వాగతం పలికారు. పూజానంతరం ఆలయస్నపన మండపలంలో మహదాశీర్వచనం నిర్వహించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్.డి.ఓ. వెంకన్న, టూరిజం అధికారి శివాజీ, తహశీల్దార్ రవీందర్ తదితరులున్నారు. అనంతరం శ్రీనివాస మంగాపురం చిత్రం హీరో గట్టమనేని జైకృష్ణ, దర్శకుడు అజయ్ భూపతి మరియు చిత్రం యూనిట్ సభ్యులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించారు.

# హక్కుల కోసం తెలంగాణ నుంచి ఢిల్లీలో గళమెత్తిన టీ.డబ్ల్యూ.జే.ఎఫ్

## జంతర్ మంతర్ ధర్నాకు జాతీయ మీడియా విస్తృత కవరేజ్

## జర్నలిస్టుల సమస్యలపై తెలంగాణ ముందుకు రావడం అభినందనీయం

జాతీయ మీడియా ప్రతినిధులు

ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి, జూలై 27:



దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు అధ్యక్షులు మామిడి సోమయ్య ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాకు విశేష స్పందన లభించిందని ఆ సంఘం జిల్లా నాయకులు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమాన్ని పలు జాతీయ మీడియా సంస్థలు విస్తృతంగా కవర్ చేయడం విశేషమని తెలిపారు. తెలంగాణ నుంచి జర్నలిస్టుల హక్కుల కోసం దేశ రాజధానిలో పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించడం అభినందనీయమని పలువురు జాతీయ మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పాత్రికేయుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ముందుండి పోరాటం చేయడం గొప్ప విషయమని వారు అభిప్రాయపడ్డారు. ధర్నా కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు 2019లో కరోనా సమయంలో జర్నలిస్టులకు రైల్వే పాసు రాయితీ సదుపాయాన్ని ఉపసంహరించడం జరిగిందని,

జాతీయస్థాయిలో మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి పార్లమెంట్లో బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో జర్నలిస్టులకు సంబంధించి ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించాలని దాని ద్వారా అర్హులైన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు ఉచిత హెల్త్ కార్డ్స్ ఇళ్ల స్థలాలు పిల్లలకు విద్య వైద్యం ఉచితంగా అందించాలని వారు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జర్నలిస్టులు కూడా టీడబ్ల్యూజేఎఫ్ చేపట్టిన ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పాత్రికేయుని హక్కుల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. జాతీయ మీడియా విస్తృత కవరేజ్ తో ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కు దక్కిన గుర్తింపుగా పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నాగేష్ కోశాధికారి వేములకొండ రమేష్ , నేషనల్ కౌన్సిల్ మెంబర్ వెలుగోటి వెంకట్ జిల్లా సభ్యులు మామిడాల కిరణ్, కప్పల మధు, గుజ్జు గోపాలకృష్ణ వెలిశెట్టి రామకృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు

# వరంగల్ విద్యా అభివృద్ధిపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన.

## వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్, భౌతిక మౌలిక వసతుల కల్పనపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రస్తావించారు. సమగ్ర శిక్ష పథకం అమలు, డిజిటల్ విద్య విస్తరణ, పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి, కేంద్ర నిధుల కేటాయింపులపై సమగ్ర వివరాలు కోరారు.

గత కొంతకాలంగా వరంగల్‌లో ప్రభుత్వ విద్య బలోపేతం, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల పెంపు అంశాలను నిరంతరం పార్లమెంట్‌లో ప్రస్తావిస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తాజాగా డిజిటల్ విద్యా మౌలిక వసతులపై కేంద్రాన్ని ప్రశ్నించారు. తెలంగాణతో పాటు వరంగల్ జిల్లాకు గత ఐదేళ్లలో కేంద్రం నుంచి అందిన సహాయం, చేపట్టిన పనులు, విద్యార్థులకు కలిగిన ప్రయోజనాల వివరాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సమగ్ర శిక్ష పథకం కింద దేశవ్యాప్తంగా పీఎం ఈ–విద్య, దీక్ష, ఐసీటీ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ద్వారా సాంకేతిక ఆధారిత బోధనను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాల వార్షిక కార్యాచరణ ప్రణాళికల మేరకు కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణకు గత ఐదేళు ్లగా డిజిటల్ విద్యా వసతుల అభివృద్ధికి గణనీయమైన మద్దతు లభించిందని కేంద్రం వెల్లడించింది. 2025–26 విద్యా సంవత్సరంలో రాష్ట్రానికి 1,242 ఐసీటీ ల్యాబ్‌లు, 2,036 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లకు ఆమోదం లభించగా, ఇందుకు రూ.108.98 కోట్ల మేర నిధులు మంజూరు చేసినట్లు పేర్కొంది.ఈ మేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్‌లో ప్రభుత్వ విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. పార్లమెంట్ వేదికగా వరంగల్ అవసరాలను నిరంతరం కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నానని, విద్య, మౌలిక వసతులు, డిజిటల్ సదుపాయాల విషయంలో మరిన్ని నిధులు, ప్రాజెక్టులు సాధించేందుకు తన కృషి కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే డిజిటల్ వసతులు, ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు అత్యంత కీలకమని పేర్కొన్నారు. అందుకు కేంద్రం మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. వరంగల్‌ను విద్యా రంగంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు తాము కట్టుబడి ఉన్నామని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలి.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



బహుజన విప్లవ వీరుడు, స్వరాజ్య స్థాపకుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ జయంతి వేడుకలను ఆగస్టు 18న గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని కోరుతూ తెలంగాణ గౌడ యువజన సంఘం (౮ꟸూ) ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ హనుమకొండ జిల్లా కలెక్టర్‌లకు వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేష్ గౌడ్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ బహుజనుల ఆత్మగౌరవానికి, పోరాట స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆయన చరిత్రను, త్యాగాలను నేటి తరాలకు తెలియజేసే విధంగా ప్రభుత్వం జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని కోరారు.ఆగస్టు 18న జరిగే జయంతి వేడుకలను గ్రామ, మండల, రెవెన్యూ డివిజన్, జిల్లా స్థాయిల్లో అధికారికంగా నిర్వహించి, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘాలు, బహుజన సంఘాల ప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్లను కోరినట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులకు ముందస్తు ఆదేశాలు జారీ చేసి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు

తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే జిల్లా స్థాయి ప్రధాన కార్యక్రమాన్ని బహిరంగ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘాల నాయకులు, బహుజన సంఘాల ప్రతినిధులను అధికారికంగా ఆహ్వానించాలని కోరారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ చరిత్ర, ఆయన చేసిన పోరాటాలు, బహుజన సమాజానికి అందించిన స్ఫూర్తిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బండారి జనార్ధన్ గౌడ్, చిర్ర సుమన్ గౌడ్, నాగపూరి వెంకటేష్ గౌడ్, నరేష్ గౌడ్ తదితర గౌడ నాయకులు పాల్గొన్నారు.



# కోయంబత్తూరులో సర్జరీ

మెగాస్టార్ చిరంజీవి వారసుడిగా గ్లోబల్ స్టార్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్నారు రామ్ చరణ్. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈయన ఇటీవల పెద్ది సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం పెద్ది విడుదల తర్వాత విరామం లభించడంతో తన చేతి మణికట్టు సర్జరీ కోసం ఆదివారం తన భార్య ఉపాసన, తల్లిదండ్రులు చిరంజీవి, సురేఖలతో కలిసి కోయంబత్తూర్ కి వెళ్ళిన విషయం తెలిసిందే. అయితే సోమవారం కోయంబత్తూర్ లోని గంగ హాస్పిటల్ లో డాక్టర్ రాజశేఖరన్ ఆధ్వర్యంలో ఆయన చేతి మణికట్టుకు సర్జరీ దిగ్విజయంగా పూర్తయింది. ఈ క్లిష్టమైన సర్జరీలో యూఎస్ మియామీకు చెందిన మణికట్టు స్పెషలిస్ట్, డాక్టర్ అలెంజాడ్రో బేడియా కూడా ఈ ఆపరేషన్ లో భాగమయ్యారని గంగా హాస్పిటల్ ఒక ప్రకటనలో తెలిపింది. రామ్ చరణ్ వేగంగా కోలుకుంటున్నారని, అయితే కొన్ని వారాల పాటూ విశ్రాంతి తప్పనిసరిగా తీసుకోవాల్సి వస్తుందని వైద్య బృందం తెలిపింది. ప్రస్తుతం రామ్ చరణ్ కి సర్జరీ పూర్తయిందని తెలియడంతో మెగా అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.



## వెంకీ ఆదర్శ కుటుంబం గ్లింప్స్ రిలీజ్

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న ఆదర్శ కుటుంబం-హౌస్ నెం. 47 సినిమా నుంచి కొత్త గ్లింప్స్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో వెంకటేష్ పోషిస్తున్న చిట్టిబాబు పాత్రను ప్రేక్షకులకు పరిచయం చేస్తూ మేకర్స్ ఒక ఫన్ వీడియోను రిలీజ్ చేశారు. ఇందులో చిట్టిబాబు క్యారెక్టరైజేషన్, డైలాగ్ డెలివరీ చూస్తుంటే వెంకీ మార్క్ కామెడీ మళ్లీ స్క్రీన్ మీద చూడబోతున్నామని అర్థమవుతోంది. అప్పుడే కొత్తగా ఇల్లు చూస్తున్న జంటగా వెంకీ శ్రీనిధి కనిపించారు. కిచెన్ లో ఏసీ.. నువ్వు వంట చేసేటప్పుడు ఏసీ వేసుకుని హ్యాపీగా చేసుకోవచ్చు కదా అని హీరోయిన్ శ్రీనిధి శెట్టి సరదాగా అంటుంది. దానికి వెంకటేష్ చాలా స్టైలిష్ గా ఎస్, ఐ యామ్ ది మ్యాన్ ఆఫ్ ది హౌస్ అని చెప్పడం హైలెట్ అవుతోంది. వాషింగ్ మిషన్ కూడా ఉంది కాబట్టి నీకు పని బాగా తగ్గిపోయినట్లే అని వెంకటేష్ ఫీల్ అవుతుంటాడు. నిజానికి ఇంట్లో వంటల నుంచి బట్టలు ఉతకడం వరకు అన్నీ అతనే చేసుకుంటూ, తనను తాను బాస్ గా ఫీల్ అయ్యే క్యారెక్టర్ లో వెంకీ కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇదే గ్లింప్స్ లో రఘు బాబుతో వెంకటేష్ చెప్పే డైలాగ్స్ సినిమాకు మరో హైలైట్. ఇంట్లో ఎవరేం పని చేసినా నచ్చదని, అందుకే అన్నీ తానే చూసుకుంటానని చిట్టిబాబు అనడం.. దానికి రఘు బాబు కౌంటర్ ఇస్తూ, ఆవిడకు ఏమీ రాదు కాబట్టి అన్నీ మీరే చేసుకుంటారని అర్థమైంది అనడం చూస్తుంటే కామెడీ యాంగిల్ ను గట్టిగానే టచ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిన్న డైలాగ్ ఎక్స్ఛేంజ్ తోనే సినిమాలో హీరో క్యారెక్టర్ ఎంత ఎంటర్టైనింగ్ గా ఉండబోతోందో త్రివిక్రమ్ హింట్ ఇచ్చారు. అలాగే నారా రోహిత్ ఆదర్శ కుటుంబం అని చెప్పడం మరో హైలెట్. అతని పాత్ర సినిమా కథలో చాలా కీలకం అని తెలుస్తోంది. ఇందులో వెంకటేష్ ఇద్దరు పిల్లల తండ్రిగా ఒక సాధారణ కుటుంబ పెద్ద పాత్రలో కనిపించనున్నారు. భార్య స్వర్ణ పాత్రలో శ్రీనిధి శెట్టి నటిస్తోంది.




# ఆగస్టు 21న 'ఇరుముడి'

మాస్ మహారాజా రవితేజ తన తదుపరి చిత్రంతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా, సెన్సిబుల్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇరుముడి' సినిమా విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ఓ కొత్త పోస్టర్‌తో వెల్లడించింది. ఇంకా 25 రోజుల్లో సినిమా రానుందంటూ చేసిన ఈ ప్రకటనతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. మాస్, యాక్షన్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రవితేజ, 'నిన్ను కోరి', 'మజిలీ', 'ఖుషి' వంటి ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాలతో విజయం సాధించిన శివ నిర్వాణ కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో దీనిపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. " అత్యంత హృద్యమైన తండ్రీకూతుళ్ల కథ" అంటూ మేకర్స్ ఈ సినిమా థీమ్‌ను పరిచయం చేశారు. రవితేజను ఇప్పటివరకు చూడని ఒక కొత్త ఎమోషనల్ పాత్రలో ఈ చిత్రం చూపించబోతోందని స్పష్టమవుతోంది. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ, బేబీ నక్షత్ర తండ్రీకూతుళ్లుగా కనిపించడం ఆకట్టుకుంటోంది. ఈ చిత్రాన్ని ప్రఖ్యాత నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రముఖ నటుడు సాయికుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ పూడి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## గ్రాండ్‌గా 'పొలిమేర 3' స్టార్ట్

ఓటీటీలో 'మా ఊరి పొలిమేర'తో సంచలనం సృష్టించి, థియేటర్లలో 'పొలిమేర 2'తో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కిస్తున్న విజయవంతమైన హారర్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ ఇప్పుడు పొలిమేర-3గా మరింత పవర్‌ఫుల్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ మూవీ సికింద్రాబాద్‌లోని ఓ గణేష్ ఆలయంలో సంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తొలి క్లాప్ ఇవ్వగా, సీనియర్ నిర్మాత డి. సురేష్ బాబు కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ ప్రకటనలో అతిపెద్ద ఆకర్షణగా యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా 'పొలిమేర' వరల్డ్‌లోకి అడుగుపెట్టడం నిలిచింది. 'బ్లాస్ట్ జోన్' విజయానంతరం అర్జున్ ఈ ఫ్రాంచైజీలో కీలకమైన శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. దక్షిణ భారతదేశవ్యాప్తంగా తనదైన స్క్రీన్ ప్రెజెన్స్, శక్తివంతమైన నటనతో అభిమానులను సంపాదించుకున్న అర్జున్ చేరికతో 'పొలిమేర 3'పై అంచనాలు మరింత పెరిగాయి. కాగా.. తన ఉత్కంఠభరిత కథనం, ఊహించని మలుపులతో 'పొలిమేర'ను కల్ట్ ఫేవరెట్‌గా నిలిపిన దర్శకుడు అనిల్ విశ్వనాథ్ ఈసారి తన అత్యంత ప్రతిష్ఠాత్మక కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ మూడో భాగంలో మరింత లోతైన రహస్యాలు, భయానక అతీంద్రియ అంశాలు, సంచలనాత్మక మలుపులతో 'పొలిమేర' ప్రపంచాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.






## జూనియర్ ఎన్టీఆర్ భుజానికి గాయం

ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకోగా, ఆయనకు కనీసం ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. ఈ మేరకు వైద్యుల బృందం సోమవారం ఒక అధికారిక హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. ఇటీవలే బాలకృష్ణ షూటింగ్ లో గాయపడగా, ఇప్పుడు ఎన్టీఆర్ కూడా గాయపడడంతో నందమూరి అభిమానులు ఆందోళనకు గురయ్యారు. కాగా, డాక్టర్ జె. మధుసూదన్ రావు, డాక్టర్ ఆర్. ఎ. పూర్ణచంద్ర తేజస్వి నేతృత్వంలోని వైద్య బృందం ఎన్టీఆర్‌కు పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించింది. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ శరీర పరిస్థితిని, గాయం తీవ్రతను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, భుజం కండరాలు మరియు ఎముకలు పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల విశ్రాంతి తప్పనిసరని వైద్యులు వెల్లడించారు. ఫలితంగా, ఆయన దాదాపు రెండు నెలల పాటు షూటింగ్‌లకు దూరంగా ఉండి, విశ్రాంతికే పరిమితం కానున్నారు. అభిమానులు, శ్రేయోభిలాషులు ఆందోళన చెందాల్సిన పని లేదని, ఎన్టీఆర్‌కు మెరుగైన వైద్యం అందుతోందని వైద్యులు భరోసా ఇచ్చారు. మరోవైపు, గాయం విషయం తెలియగానే సోషల్ మీడియా వేదికగా అభిమానులు స్పందిస్తూ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పెద్ద ఎత్తున సందేశాలు పోస్ట్ చేస్తున్నారు.

## కహానీ3లో యామీ గౌతమ్!



బాలీవుడ్‌లో మోస్ట్ సస్పెన్స్ థ్రిల్లర్ ఫ్రాంచైజీల్లో ఒకటిగా గుర్తింపు పొందిన కహానీ సిరీస్‌కు సంబంధించిన తాజా డిస్కషన్స్ సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. డైరెక్టర్ సుజోయ్ ఘోష్ మరోసారి కహానీ3 ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈసారి కథతో పాటు మెయిన్ లీడ్ విషయంలో కూడా కీలక మార్పులుండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత రెండు భాగాల్లో కథకు కేంద్రబిందువుగా నిలిచిన విద్యా బాలన్ ప్లేస్ లో ఈసారి యామీ గౌతమ్‌ను తీసుకురావాలనే ఆలోచనలో డైరెక్టర్ ఉన్నారనే ప్రచారం బాలీవుడ్‌లో జోరుగా వినిపిస్తోంది. 2012లో కేవలం రూ. 8 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన కహానీ రిలీజైన తర్వాత బాక్సాఫీస్ వద్ద భారీ సక్సెస్ ను నమోదు చేసింది. రూ. 100 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించడమే కాకుండా, లేడీ ఓరియెంటెడ్ కథతో కూడా కమర్షియల్ సక్సెస్ సాధించవచ్చని నిరూపించింది. విద్యా బాలన్ యాక్టింగ్ ఆ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. తర్వాత 2016లో వచ్చిన కహానీ2 విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ, మొదటి భాగం స్థాయిలో బాక్సాఫీస్ ఫలితాలను అందుకోలేకపోయింది. దాదాపు పదేళ్ల గ్యాప్ తర్వాత ఇప్పుడు మూడో భాగంపై మళ్లీ డిస్కషన్స్ మొదలయ్యాయి. తాజా సమాచారం ప్రకారం, కహానీ3 పూర్తిగా కొత్త కథాంశంతో తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. అందుకే కొత్త తరానికి కనెక్ట్ అయ్యే హీరోయిన్ ను ఎంపిక చేయాలనే ఆలోచనలో సుజోయ్ ఘోష్ ఉన్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల వరుస సక్సెస్‌లతో మంచి ఫామ్‌లో ఉన్న యామీ గౌతమ్ ఈ క్యారెక్టర్ కు ఫస్ట్ ఛాయిస్ గా మారినట్లు ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా ఆర్టికల్ 370 సినిమాలో ఆమె యాక్టింగ్ కు నేషనల్ లెవెల్ గుర్తింపు రావడం, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాల్లో ఆమెకు పెరిగిన క్రేజ్ ఈ డెసిషన్ కు కారణమని టాక్ వినిపిస్తోంది. యాక్షన్, సస్పెన్స్, ఎమోషనల్ క్యారెక్టర్లను సమర్థంగా పోషించే సామర్థ్యం యామీకి ఉండటంతో, కహానీ లాంటి ఫ్రాంచైజీకి ఆమె సరైన ఎంపిక అవుతారని మేకర్స్ భావిస్తున్నారనే డిస్కషన్ కూడా నడుస్తోంది. మరోవైపు, గత రెండు భాగాలతో విడదీయరాని అనుబంధం కలిగిన విద్యా బాలన్‌ను పూర్తిగా పక్కన పెట్టకుండా, ఆమె కోసం స్పెషల్ క్యామియో క్యారెక్టర్ ను రూపొందించే అవకాశాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఈసారి సినిమా ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారని కూడా ప్రచారం జరుగుతోంది.